కొత్త పింఛన్ల ఊసేదీ..!

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటినా కొత్త పింఛన్ల ఊసే లేదు. అర్హులైన వృద్ధులు, వితంతువులు ఏడాదిగా గ్రామ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు 50 ఏళ్లకే పింఛన్లు అందిస్తామని ఆశలు పెంచి, ఓట్లు దండుకుని ఇప్పుడు ముఖం చాటేస్తున్నారని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు పట్టుకుని కార్యాలయాలకు వెళితే వెబ్‌సైట్ ఓపెన్ కాలేదంటూ.. అధికారులు కసురుకుంటున్నారని వాపోతున్నారు.



- కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత దరఖాస్తుకు వీల్లేని వైనం
- సచివాలయాల చుట్టూ అర్హుల ప్రదక్షిణలు
- వెబ్‌సైట్ ఓపెన్ కాలేదంటున్న సిబ్బంది
- ఆవేదనలో వృద్ధులు, వితంతువులు

పరవాడ: మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో పింఛన్ అర్హులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఎప్పుడెళ్లినా ఇంకా వెబ్ సైట్ ఓపెన్ కాలేదు.. ఎప్పుడు ఓపెన్ ఓపెన్ అవుతుందో చెప్పలేం.. ఓపెన్ అయితే అప్పుడు చెప్తాం రండి.. అంటూ ఏడాది నుంచి ఇదే సమాధానం వినిపిస్తున్నారని దరఖాస్తు చేసుకోవాలనుకున్న ప్రజలు ఆక్షేపిస్తున్నారు. దీంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గద్దెనెక్కి ఏడాది దాటినా..

వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ తదితర పింఛన్లను అర్హులైన ప్రతి ఒక్కరికీ వెంటవెంటనే అందిస్తామని కూటమి ప్రభుత్వ ప్రధాన హామీల్లో ఒకటి. 50 ఏళ్లు దాటిన వారంతా పింఛన్లకు అర్హులేనని ఎన్నికల సమయంలో తెగ ఊదరగొట్టారు. తీరా ఏడాది దాటినా కొత్తగా ఒక్కరికీ పింఛన్ రాలేదు. దీంతో వయసు మళ్లిన వృద్ధులు, తోడును కోల్పోయిన మహిళలు సచివాలయాల చుట్టూ వారంలో ఒక్కసారైనా ప్రదక్షిణ చేస్తున్నారు. కొంత మంది సచివాలయ సిబ్బంది తమను ఈసడించుకుంటున్నారని చదువురాని వృద్ధులు, వితంతువులు వాపోతున్నారు.

పరవాడ మండలంలో పింఛన్ల వివరాలు	
వృద్ధాప్య పింఛన్లు	3019
వితంతు పింఛన్లు	1618
వికలాంగ పింఛన్లు	763
ఇతరులు	1135

జగన్ ప్రభుత్వంలో సత్వర మంజూరు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న అతి తక్కువ వ్యవధిలోనే పింఛన్ మంజూరయ్యేదని లబ్ధిదారులు చెప్తున్నారు. భర్త చనిపోయిన వెంటనే డెత్ సర్టిఫికెట్ సచివాలయంలో అందిస్తే దాదాపుగా ఆ మరుసటి నెల నుంచే పింఛన్ మంజూరు చేసేవారు. ప్రస్తుత పరిస్థితి దారుణంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తగా ఏ ఒక్క వితంతు పింఛనూ మంజూరు కాలేదని చెప్తున్నారు. మండలంలో గతంలో దరఖాస్తు చేసుకున్న 88 మంది వితంతువులకు ఆమోదం లభించినా.. పింఛన్ మాత్రం అందట్లేదు. కొత్తగా పదుల సంఖ్యలో దరఖాస్తులు సిద్ధంగా ఉన్నా.. వాటిని స్వీకరించి, పింఛన్ జాబితాలో నమోదు చేసే నాథుడే లేడు.

చీపుర్లు విక్రయిస్తూ జీవనం



నా భర్త మరణించి మూడేళ్లవుతోంది. ఆయన ఉన్నపుడు ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌తో బతుకు వెళ్లదీసేవాళ్లం. ఆయన చనిపోవడంతో మరోదారి లేక చీపుర్లు అమ్ముతూ వచ్చిన డబ్బులతో తిండి గింజలు కొనుక్కుంటున్నాను. కొత్త పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రస్తుతం అవకాశం లేదని ఆఫీసర్లు చెప్తున్నారు. పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

– బందారు కన్నమ్మ, వెంకటపతిపాలెం

ప్రభుత్వం ఆదుకోవాలి



నా భర్త మరణించి ఏడాదిన్నర కావస్తోంది. ఇంత వరకు నాకు పింఛన్ రాలేదు. నా భర్త డెత్ సర్టిఫికెట్ పట్టుకుని సచివాలయం చుట్టూ తిరుగుతున్నా.. ఫలితం కనిపించలేదు. చిన్న కిరాణా దుకాణం నడుపుతూ బతుకు వెళ్లదీస్తున్నాను. అనారోగ్య సమస్యలు, గృహ అవసరాల కోసం నానా ఇబ్బందులు పడుతున్నాను. నాలాంటి వారిని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– గుండా నాగలక్ష్మి, వాడచీపురుపల్లి

ప్రభుత్వ ఆదేశాలు రావాలి



కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు తీసుకోవడానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి. పింఛన్లకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తరువాతే దరఖాస్తులు స్వీకరిస్తాం.

– బి.రమేష్‌నాయుడు, ఎంపీడీవో, పరవాడ

క్లుప్తంగా

ఉమాచంద్రమౌళీశ్వరుడికి అభిషేకాలు



సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో కొలువైన ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు, మహిళలు ఆలయానికి తరలివచ్చి, స్వామిని దర్శించుకున్నారు. బిల్వ పత్రాలతో స్వామికి అర్చన చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను నిర్వహించారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

లైంగిక వేధింపుల దోషుల్ని శిక్షించాలి



సీఐ గణేష్‌కు వినతి పత్రం అందిస్తున్న ఐద్వా నాయకులు

పరవాడ: అచ్యుతాపురం శివారు కోనాంపాలెం దాబాలో ఇటీవల 13 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్షరాలు పి.మాణిక్యం, జాయింట్ సెక్రటరీ ఆర్.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు అచ్యుతాపురం సీఐ గణేష్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. అచ్యుతాపురం సెజ్, తదితర చిన్న చిన్న హోటళ్లలో పని చేయడానికి వస్తున్న మహిళలపై ఇలాంటి ఘటనలు జరిగితే, పోలీసులు వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులకు సంబంధించిన నిందితులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు పరవాడ మండల సర్వసభ్య సమావేశం

పరవాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పరవాడ మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఉదయం 10.30 గంటలకు పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు విధిగా హాజరు కావాలని కోరారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఆరుగురికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.60 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. సోమవారం వీరందరిని జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 15 వినతులు



వినతిని పరిశీలిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 15 వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్-8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలోత్సవం పోటీలకు ఆహ్వానం



బాలోత్సవం బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపకులు, నిర్వాహకులు

- సాంస్కృతిక, విద్యాపరమైన పోటీలు
- సెప్టెంబర్ 13, 14న బహుమతుల ప్రదానం

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సెప్టెంబర్ 13, 14 తేదీల్లో బాలోత్సవం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్, బాలోత్సవం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఉత్సవం సందర్భంగా పాఠశాలల విద్యార్థుల కోసం 45 రకాల సాంస్కృతిక, అకడమిక్ ఈవెంట్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాలోత్సవం పోటీల్లో ఎన్ఏడీ కొత్త రోడ్, సింహాచలం, నరవ, గోపాలపట్నం, పెందుర్తి ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఆయా పోటీలు సీనియర్, జూనియర్ విభాగాల్లో జరుగుతాయన్నారు. పోటీలకు సంబంధించిన బ్రోచర్లు ప్రతి పాఠశాలకు అందిస్తామని, ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబర్ 6లోపు ఏయే అంశాల్లో పాల్గొంటారో వివరంగా అందించాలని సూచించారు. సెప్టెంబర్ 13, 14 తేదీల్లో జరగనున్న బాలోత్సవంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు. జిల్లా బాలోత్సవం కార్యదర్శి జి.ఎస్.రాజేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక ప్రతినిధి శేషగిరిరావు, వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ ప్రతినిధులు రమాప్రభ, సతీష్, కళాశాల అధ్యాపకురాలు నాగమణి, బాలోత్సవం కమిటీ ప్రతినిధులు ఎస్సీ అప్పారావు, కె.నర్సింగరావు, శంకర్రావు, మహేష్, సతీష్ పాల్గొన్నారు.

చెట్టును ఢీకొని యువకుడి దుర్మరణం



ప్రదీప్‌కుమార్ (ఫైల్)

తగరపువలస: ఆనందపురం మండలం నీళ్లకుండీలు -సింహాచలం రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మామిడి ప్రదీప్‌కుమార్(25) దుర్మరణం చెందాడు. వేపగుంట ముత్యమాంబ కాలనీకి చెందిన ప్రదీప్‌కుమార్ పద్మనాభం నుంచి నీళ్ల కుండీల వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఆ క్రమంలో రోడ్డుకు కుడివైపున ఉన్న చెట్టును బలంగా ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు ఆనందపురం సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ ప్రవేశాలకు తుది గడువు 31

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ఈ నెలాఖరు(31)తో గడువు ముగియనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శిరీషారాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు తల్లికి వందనం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్, బ్యాగ్‌లు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటి కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాలు గణనీయంగా పెరిగాయన్నారు. సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత ఏడాది 278 ప్రవేశాలు జరగగా, ఈ ఏడాది 370 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 31 చివరి తేదీ కావడంతో అర్హత, ఆసక్తిగల విద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు.

సుజల స్రవంతి నిర్వాసితుల నిరసన



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నల్లరేగుడుపాలెం గ్రామం రైతులు

అనకాపల్లి టౌన్: సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని, బలవంతపు భూ సేకరణ చేయొద్దని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఆవరణలో సబ్బవరం మండలం నల్లరేగుడుపాలెం రెవెన్యూ గ్రామ రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వీరంతా 70 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములు కోల్పోవడం వల్ల రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. ఈ భూములకు బదులు వేరొక చోట భూములు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ప్రస్తుత మార్కెట్ విలువకు నాలుగు రెట్లు నష్టపరిహారం అందివ్వాలన్నారు. కార్యక్రమంలో గంటా శ్రీరామ్, వి. నరేంద్ర కుమార్, పెతకంశెట్టి రమేష్, బుగుడి నూక అప్పారావు, గొలగాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన ఇంటర్ అడ్మిషన్లు

పరవాడ: అనకాపల్లి జిల్లాలోని 20ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు స్వల్పంగా పెరిగినట్లు పరవాడ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అనకాపల్లి జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి ఎం.వినోద్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25లో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో 3,156 అడ్మిషన్లు కాగా ఈ ఏడాది 3,286 మంది ప్రవేశాలు పొందినట్లు వెల్లడించారు. ఇంకా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

మత్తుకు బానిసలైతే జీవితాలు చిత్తు



గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న సీఐ రామచంద్రరావు

సబ్బవరం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, రహదారుల భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సబ్బవరం సీఐ వి.రామచంద్రరావు తెలిపారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో రహదారుల భద్రత, మత్తు పదార్థాల నిర్మూలనపై సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా క్రమ శిక్షణతో విద్యను అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో మత్తు పదార్థాలను దరిచేరనీయకుండా జాగ్రత్తపడాలన్నారు. గంజాయి, మద్యం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలైతే కుటుంబాలు చిత్తవుతాయన్నారు. యువత అత్యధికంగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. రహదారుల భద్రపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సింహాచలం, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.చిరంజీవిరావు, పీడీ పీఎల్ఎన్ ప్రసాద్, పీఈటీ వి.సూర్యనారాయణ, ఉపాధ్యాయుడు ఆర్.ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

థైలేరియా టీకాల కార్యక్రమం ఆకస్మిక తనిఖీ



గొల్లలపాలెంలో థైలేరియా టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

సబ్బవరం: మండలంలోని సబ్బవరం ప్రాంతీయ పశు వైద్యశాల పరిధి గొల్లలపాలెం గ్రామంలో జరుగుతున్న ఉచిత థైలేరియా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని విశాఖపట్నం డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ ఎం.చంద్రశేఖర్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలో జరుగుతున్న టీకా కార్యక్రమ తీరును ఆరా తీశారు. అనంతరం స్థానిక రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. సబ్బవరం పశువైద్యశాల పరిధిలోని పశు వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి, ప్రస్తుతం అమలులో ఉన్న కార్యక్రమాలు, అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సబ్బవరం ఏరియా పశు వైద్యశాల ఇన్‌చార్జ్ సహాయ సంచాలకుడు డాక్టర్ చిట్టినాయుడు, పశు వైద్యాధికారులు స్వర్ణలత, అరుణ, సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వెల్‌నెస్ కేంద్రం బిల్లు నిలిపేశారు..

తుమ్మపాల/సబ్బవరం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన వెల్‌నెస్ కేంద్రం నిర్మాణం పూర్తి చేసి ఏడాది దాటిందని, ఎన్నికల అనంతరం మంజూరైన పెండింగ్ బిల్లు రూ.7,50,314లు చెల్లించకుండా టీడీపీ నేత గండి బాబ్జీ సంబంధిత అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి నిలిపేశారని సబ్బవరం మండలం మొగలిపురం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ యడ్ల నాయుడు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు వినతి పత్రం అందించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఈ మేరకు మొరపెట్టుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏడాది కాలంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, ఇంజినీరింగ్ అధికారులకు అనేక వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదంటూ నిరసనకు సిద్ధమవ్వగా సిబ్బంది బయటకు ఈడ్చుకెళ్లారని పేర్కొన్నారు. తనకు రావాల్సిన బిల్లు వెంటనే చెల్లించాలంటూ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సర్పంచ్ పదవికి గండి బాబ్జీ భార్యపై పోటీ చేయడంతో కక్ష కట్టి కావాలనే బిల్లు నిలిపివేశారని, సర్పంచ్‌పై, గండి బాబ్జీపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

అగనంపూడి: విద్యార్థులు సేవా రంగంలో రాణించాలంటే సమాజం స్థితిగతులు తెలుసుకోవాలని విజ్ఞాన్ ఇంజనీరింగ్, విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు జె.సుధాకర్, బి.అరుంధతి అన్నారు. విద్యా సంస్థల చైర్మన్ రత్తయ్య జన్మదినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్, విమ్స్,ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. మొత్తం 240 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, లయన్స్ క్లబ్ ఉత్తరాంధ్ర ఉపగవర్నర్ కె.వి.సుబ్బరాజు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, క్లబ్‌జోన్ చైర్మన్ ఎ.మరళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు వదిలి.. సినిమా ప్రచారమా!

- సాంఘిక సంక్షేమ హాస్టళ్ల సమస్యలను ఎమ్మెల్యే పట్టించుకున్నారా?
- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు హేమంత్



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న హేమంత్, మురళి



వంటశాలను పరిశీలిస్తున్న హేమంత్

పెందుర్తి: నియోజకవర్గంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యలను గాలికి వదిలేసి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సినిమా ప్రచారాల్లో బిజీగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్‌కుమార్ ధ్వజమెత్తారు. నిరుపేద విద్యార్థుల బాధలు కంటే ఎమ్మెల్యేకు తమ అధినేత సినిమాకు డబ్బులు తేవాలన్న గోలే ఎక్కువైందని విమర్శించారు. ఇటీవల వసతి గృహాల దుస్థితిపై సాక్షిలో ప్రచురితమైన కథనాల మేరకు పులగానిపాలెంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ప్రతినిధులు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వంటశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ వసతిగృహంలో కనీస వసతులు లేవన్నారు. విద్యార్థులు నేలపైనే నిద్రిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్‌లో ఉన్న ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదని చెప్పారు. సబ్బవరం, పరవాడ వసతిగృహాల్లో సైతం విద్యార్థులు నేలపై పడుకునే దుస్థితి ఉందన్నారు. పేద విద్యార్థులు వసతిగృహాల్లో ఇంతటి క్షోభను అనుభవిస్తుంటే ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాత్రం సినిమా ప్రచారం కోసం ప్రజాధనాన్ని విచ్చలవిడిగా వెదజల్లారని ఆరోపించారు. ఏడాదిలో ఒక్కసారైనా సాంఘిక సంక్షేమ వసతి గృహానికి వెళ్లి విద్యార్థుల సమస్యలు తెలుసుకోని ఎమ్మెల్యే.. సినిమా ప్రచారం కోసం మాత్రం ఐదు రోజుల పాటు నియోజకవర్గంలోని ప్రజలను ఇబ్బందులు పెడుతూ బైక్ ర్యాలీలు, పూజలు, ప్రార్థనలు చేశారని మండిపడ్డారు. ప్రజా సమస్యలు గాలికి వదిలేసి సినిమా ప్రచారాలు, కార్యకర్తల పుట్టిన రోజులు చేసుకోవడమేనా మీ పని అని ప్రశ్నించారు. ఇప్పటికైనా నియోజకవర్గంలోని విద్యార్థులు, ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే, ఇతర కూటమి నాయకులు శ్రద్ధ పెట్టాలని హితవు పలికారు. పెందుర్తి నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గొలగాని మురళి, వలంటీర్ల విభాగం అధ్యక్షుడు అవగడ్డ శ్రీనివాస్, సోషల్ మీడియా అధ్యక్షుడు సాయిరాం పాత్రుడు, విద్యార్థి విభాగం ప్రతినిధులు శివ, రాజు, త్రినాథ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.